# పేదలకు వరం ఆరోగ్యశ్రీ

- ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి, డిసెంబర్ 10 : ఆరోగ్యశ్రీ పథకం పేద ప్రజలకు వరం అని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు నగదు పెంపునకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సులో ఫ్రీ టికెట్లు ఇచ్చి వారితో కలిసి ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను రానున్న వంద రోజుల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తూ ప్రజలకు మంచి వైద్యం అందించాలని సంబంధిత వైద్యులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రజా దర్బార్ ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ కిరణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, డాక్టర్ పెండెం వెంకటరమణ, డాక్టర్ నిర్మల్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గుడిపాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తుంగతుర్తి : కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్



ఆరోగ్యశ్రీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ వీరబ్రహ్మాచారి

### ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ వీరబ్రహ్మాచారి అన్నారు. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జడ్పీ సీఈఓ సురేశ్, సూపరింటెండెంట్ డాక్టర్ మురళీదర్‌రెడ్డితో కలిసి రాజీవ్ ఆరోగ్యశ్రీ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యసాయాన్ని రూ.10 లక్షలకు పెంచిందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

# పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి రిటైర్డ్ ఉద్యోగుల విన్నపం
- ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయంపై అభినందనలు, సన్మానం

సూర్యాపేటటౌన్, డిసెంబర్ 10 : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సూర్యాపేట అభివృద్ధిని కొనసాగించాలని, అలాగే పెన్షనర్ల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని రిటైర్డ్ ఉద్యోగులు కోరారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించడంపై రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో జగదీశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కృపాకర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మండల కార్యదర్శి నాగేశ్వర్‌రావు, బి.వీరయ్య, డి.వెంకన్న, వి.సత్య నారాయణరావు, భిక్షారెడ్డి, వి.రాంరెడ్డి, కె.రాంరెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.

# కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 10 : బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి ఆదివారం మండలంలోని సోలిపేట గ్రామంలో గల కోదండరామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల దీవెనలు ఎల్లప్పుడూ కేసీఆర్‌కు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కందుల కుశలవరెడ్డి, నర్ర పరమేశ్, బొడ్డు రవీందర్, బొడ్డు బాలకృష్ణ, సతీశ్, మధుసూదన్, శ్యామ్‌సుందర్, సురేందర్ పాల్గొన్నారు.




నాగారం : దర్గాలో కొబ్బరికాయలు కొట్టిన నసీర్‌పాషా

### ప్రత్యేక ప్రార్థనలు..

నాగారం : మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ మండలంలోని శాంతినగర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల మైనార్టీ సంయుక్త కార్యదర్శి షేక్ నజీర్‌పాషా జాజిరెడ్డి గూడెం మండలం హజ్రత్ సయ్యద్ ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గాలో 101 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శాంతినగర్ యూత్ అధ్యక్షుడు షేక్ యాకు, షేక్ జాన్ సైదా, ఖాసీం, హుస్సేన్, మదార్, అనీల్, నాగుల్, రఫీ, జాన్‌పాషా, నంద్యాలు, ఉమ్మర్, యూసుఫ్ పాల్గొన్నారు.



సూర్యాపేటరూరల్ : సోలిపేటలో పూజలు చేస్తున్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి




ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని నినదిస్తున్న గృహ కార్మికులు

# గృహ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హసేన్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 10 : ఇండ్లలో పనిచేసే వారిని గృహ కార్మికులుగా గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని ప్రముఖ న్యాయవాది, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్ కోరారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గృహ కార్మికుల యూనియన్ జిల్లా కో ఆర్డినేటర్ కాసా అనసూర్య అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గృహ కార్మికులకు నెలకు రూ.15 వేల వేతనం, వారానికి ఒక సెలవుతో పాటు ఇంటి స్థలం, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని పేర్కొన్నారు.గృహ కార్మికుల సంఘం అధ్యక్షురాలు స్వాతి, ఉపాధ్యక్షురాలు పద్మ పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మేడి పాపయ్య

బొడ్రాయిబజార్, డిసెంబర్ 10 : ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మేడి పాపయ్యమాదిగ ఎన్నికయ్యారు. హైదరాబాద్ ఎల్బీనగర్‌లో గల ఎస్.ఆర్.గార్డెన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మేడి పాపయ్యమాదిగను ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లేటి లక్ష్మణ్‌మాదిగ ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ చౌరస్తాలో మాట్లాడుతూ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కనుక జానయ్య, వల్దాస్ మహేందర కనుకరాజు, కనుకు ప్రశాంత్, చందుపట్ల చిరంజీవి, మల్లయ్య, బొజ్జ సాయి పాల్గొన్నారు.

## గీత కార్మికులకు బీమాపై అవగాహన కల్పించాలి

- గౌడ జన హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చయ్యగౌడ్

నూతనకల్, డిసెంబర్ 10 : రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు అందిస్తున్న బీమాపై అవగాహన కల్పించాలని గౌడ జన హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కి బుచ్చయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బీమా పొందడానికి కావాల్సిన అర్హతలు ఎలా పొందాలనే విషయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. గౌడ కులస్తులు ఐక్యంగా ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మల్లయ్య, రామచంద్రు, ఉప్పులయ్య, శేఖర్, రమేశ్, నాగలింగం, వీరేశం పాల్గొన్నారు.

## ఓపెన్ టెన్త్ దరఖాస్తుకు నేడు ఆఖరు

నూతనకల్, డిసెంబర్ 10 : ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ స్కూల్ సొసైటీ కో ఆర్డినేటర్ షాలాహబేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు ఈ నెల 11 చివరి తేదీ అని వెల్లడించారు. పదో తరగతిలో ప్రవేశం కోసం రికార్డు షీట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటో, అలాగే ఇంటర్‌లో చేరేందుకు పదో తరగతి టీసీ, మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫొటోతో అప్లికేషన్ ఫామ్‌ను జతచేసి సమర్పించాలని సూచించారు.

## సీఆర్‌పీ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 10 : సమగ్ర శిక్ష క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గంలో సూర్యాపేట జిల్లాకు చెందిన కంచర్ల మహేందర్ రాష్ట్ర కోశాధికారిగా, మామిడి సైదయ్య రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి వీరిని నియమించారు.

## సజావుగా ఎన్‌ఎంఎంఎస్‌ఈ పరీక్ష

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 10 : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష జిల్లాలో ఆదివారం సజావుగా ముగిసినట్లు డీఈఓ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట, కోదాడలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం వెయ్యి మంది దరఖాస్తు చేసుకోగా 966 మంది పరీక్షకు హాజరైనట్లు, 34 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.

# సూర్య దేవాలయంలో మహా సౌరహోమం

అర్వపల్లి, డిసెంబర్ 10 : మండలంలోని తిమ్మాపురంలో గల అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషా పద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామికి అలంకరణ చేశారు. మధ్యాహ్నం యజ్ఞశాలలో మహా సౌరహోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని క్షేత్ర ఆవరణలో రామకోటి స్థూపాలను దర్శించుకున్నారు. నిర్వాహకులు అన్నదానం చేశారు.



అర్వపల్లి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

### లక్ష్మీనరసింహుడి స్వాతి నక్షత్ర కల్యాణం

చివ్వెంల : మండలంలోని ఉండ్రుగొండ గిరి దుర్గంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీకమాస స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు, హైదరాబాద్, ఏపీలోని గుంటూరు నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.